# ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం



పెద్దపల్లి : మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- మంత్రికి ఘన స్వాగతం పలికిన విప్, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు

పెద్దపల్లి, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పిన విధంగా ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని, ఇప్పటికే రెండింటిని అమలు చేశామని, మరో పది పదిహేను రోజుల్లో మరో రెండు అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆయనకు జిల్లా సరిహద్దు గ్రామమైన సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జిల్లా ప్రజలు ఈ ఎన్నికల్లో తమపై పూర్తి నమ్మకం, విశ్వాసంతో నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారని, తమ వెంటన నడిచిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సైతం నాలుగు నియోజకవర్గాల్లో ప్రజలు అండగా నిలిచి పెద్దపల్లి ఎంపీని గెలిపించి, భారత ప్రధానిగా రాహుల్‌గాంధీని చేసుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లాపై పూర్తి పట్టు ఉందని, ఆయన సహకారంతో అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రధానంగా కోరుతున్న విధంగా పెద్దపల్లి, సుల్తానాబాద్‌కు బైపాస్ రోడ్లతోపాటు బస్ డిపో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బొగ్గుగని కార్మికుల సమస్యల పరిష్కారంతోపాటు పవర్‌హౌజ్, బైపాస్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మంథని నియోజకవర్గ అభివృద్ధి గతంలో ఎన్నడూ లేని విధంగా ఉండబోతోందన్నారు. రామగుండంలోని సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీలకు అనుబంధ పరిశ్రమలను మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. పారిశ్రామికంగా మరింత అభివృద్ధికి కృషి చేస్తామని, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శశిభూషణ్ కాచె, సూర సమ్మయ్య, ఉప్పు రాజు, పులిపాక శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాశ్, నూగిళ్ల మల్లయ్య, కొండి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.




పెద్దపల్లి : మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలను గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ఎంపీ సీటు కోసమే కేసీఆర్‌పై విమర్శలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే ఊరుకోం
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కార్పొరేషన్, డిసెంబర్ 17: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ బీజేపీ సీటు కోసమే బండి సంజయ్ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై ఇష్టారీతిగా విమర్శలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పాస్‌పోర్టులను సీజ్ చేయాలని బండి సంజయ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రజలకు పంచుతామని అబద్ధాలు చెప్పిన బీజేపీ, ఈ తీరుగా మాట్లాడడం వారి వైఖరిని చెబుతున్నదన్నారు. పుస్తెలు అమ్మి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసిన బండి సంజయ్ ఇప్పుడు రూ.వందల కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలన్నారు. వారి పార్టీలోని సీనియర్ నాయకులే ఈ విషయంపై అధిష్ఠానాన్ని అడుగుతున్నారని, బండి సంజయ్‌కు ఎంపీ సీటు ఇవ్వద్దని కోరుతున్నారని పేర్కొన్నారు. దీంతో తనకు ఎక్కడ ఎంపీ సీటు రాకుండా పోతుందోనన్న భయంతోనే విమర్శలు చేస్తున్నారన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తే తనకు బీజేపీ అధిష్ఠానం ఎంపీ సీటు ఇస్తుందన్న ఆశతోనే బండి సంజయ్ ఇష్టారీతిగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడం బాధాకరం అన్నారు. ప్రజల సొమ్మును దోచుకొని విదేశాలకు పారిపోయేలా పలువురు కార్పొరేట్ సంస్థలకు సహకరించిందే బీజేపీ అని విమర్శించారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలకు వెళ్తే అభివృద్ధిపై నిలదీసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. కేసీఆర్‌పై చేసిన విమర్శలకు బండి సంజయ్ బేషరతుగా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బండి సంజయ్ ఎంపీగా ఈ ఐదేళ్లలో రూ.వందల కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలన్నారు. గ్రానైట్ వారిని ఎందుకు బెదిరించారో చెప్పాలన్నారు. అడ్డగోలుగా అవినీతితో సంపాదించిన కోట్లాది రూపాయలను ఈ ఎంపీ ఎన్నికల్లోనూ ఖర్చు చేసేందుకు బండి సంజయ్ సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తే ప్రజలు సహించరన్నారు. ఇప్పటికైనా బుద్ధిగా మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్

వేములవాడ టౌన్, డిసెంబర్ 17: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. అనంతరం అద్దాలమండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. రాజన్న దర్శనం అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ, తనకు విప్‌గా అవకాశం లభించిన క్రమంలో శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నానని చెప్పారు. ఇక్కడ ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు, పట్టణ సీఐ కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ప్రభుత్వ విప్‌కు స్వామివారి శేషవస్త్రం కప్పి, ప్రసాదం అందజేస్తున్న ఏఈవో



సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సుంకపాక మనోజ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు

# కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టడంపై హర్షం

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారంటూ పదేపదే కాంగ్రెస్ చేసిన ఆరోపణలను అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే కేటీఆర్ సమర్థవంతంగా తిప్పికొట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీచౌరస్తాలో ఎమ్మెల్యే కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, ఆరు గ్యారంటీలు, 441 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను తాము విమర్శించడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న అసత్యపు ఆరోపణలను తిప్పికొడుతూనే, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై వాస్తవాలను ప్రజలకు వివరించారన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఒక మంచి నాయకుడు కేటీఆర్ మా సిరిసిల్ల ఎమ్మెల్యే కావడం ప్రజలంతా గర్విస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మునీర్, వరుణ్, మన్సూర్, అఖిల్, మధు, జాఫర్, హరీశ్, సికిందర్, అప్రోజ్, పవన్, ఇమ్రాన్, సల్మాన్, యాదగిరి, పంగ మధు, శేఖర్, జావీద్, అమ్ము, అజ్జులు పాల్గొన్నారు.



పద్మశాలీ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# ఐక్యతతోనే సంఘాలు అభివృద్ధి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మారుతీనగర్, డిసెంబర్, 17: ఐక్యతతోనే సంఘాలు అభివృద్ధి చెందుతాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. ఆదివారం మెట్‌పల్లి పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఆత్మకూర్-మెట్‌పల్లి పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన సంఘ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంఘ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు పద్మశాలీ సంఘ సభ్యులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అలాగే సంఘ భవన ప్రారంభోత్సవానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ పద్మశాలీ సంఘ సభ్యుడు బాస ధనుంజయ్ తన తండ్రి బాస పెద్ద భూమయ్య స్మారకార్థం ముద్రించిన శివపంచాక్షరి స్తోత్ర ప్రతిని ఎంపీ ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూర్-మెట్‌పల్లి పద్మశాలీ సంఘ గౌరవాధ్యక్షుడు బండి గంగాధర్, అధ్యక్షుడు నడికట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మ్యాన లింబాద్రి, కోశాధికారి మ్యాన ప్రసాద్, మెట్‌పల్లి పద్మశాలీ సంఘ అధ్యక్షుడు ద్యావపెల్లి రాజారాం, వేదపండితులు మునుగోటి రవికుమార్ శర్మ, మోహన్ శర్మ, పద్మశాలీ వాడకట్టు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ఆయా వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో భక్తులు

## రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

ధనుర్మాసం ప్రారంభం కావడంతో వేములవాడ రాజన్న ఆలయానికి ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 40 వేలమందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. రద్దీ దృష్ట్యా దేవస్థానం అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆలయ గర్భగుడిలో భక్తులు నిర్వహించుకునే ఆర్జితసేవలైన అభిషేక, అన్న, ఆకులపూజలను రద్దు చేశారు. కాగా, ఉదయం 6 గంటల నుంచే ఉచిత, శీఘ్ర దర్శన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. రాజన్నకు దాదాపు రూ.21 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. రాజన్న సన్నిధితోపాటు అనుబంధ ఆలయాలైన భీమేశ్వర, బద్దిపోచమ్మ, నగరేశ్వరాలయాలు భక్తులతో కళకళలాడాయి.

*-వేములవాడ టౌన్, డిసెంబర్ 17*